# రూ. 23 కోట్ల అభివృద్ధి పనులకు తీర్మానం

- అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం
- కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖయాదగిరి



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రేఖ, కమిషనర్ సురేందర్‌రెడ్డి, తదితరులు

మణికొండ, అక్టోబర్ 7 : గతంలో గ్రామపంచాయతీలుగా ఉన్న గ్రామాలు పట్టణీకరణగా అవతరించడంతో గడిచిన మూడున్నరేండ్ల కాలంలోనే ఎంతో ప్రగతిని సాధించడం విశేషం. ఒకప్పుడు పార్కులు, రహదారుల ఆక్రమణలపై పెనుదుమారమే సంతరించుకునేది. కానీ ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా అభివృద్ధి వైపు కొనసాగుతూ ప్రజలకు అవసరమైన సౌకర్యాలను కల్పించడంలో పురపాలక సంఘం బాటలు వేస్తోంది. నార్సింగి మున్సిపాలిటీ ఏర్పాటైన మూడున్నరేండ్ల కాలంలో దాదాపు మూడువందల కోట్ల నిధులతో అభివృద్ధి పనులను చేపట్టారు. శనివారం ప్రత్యేక కౌన్సిల్ సమావేశాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ దారుగుపల్లి రేఖయాదగిరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని వైకుంఠ ధామాలు, పార్కుల అభివృద్ధితో పాటు రహదారుల చుట్టూ ఆకుపచ్చని మొక్కల పెంపకానికి ప్రత్యేక నిధులను వెచ్చించారు. పార్కుల్లో పూర్తిగా ఆకుపచ్చని మొక్కలతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ప్రజలకు అందించాలన్న సంకల్పంతోనే ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తున్నామని చైర్‌పర్సన్ రేఖయాదగిరి తెలిపారు. అదే విధంగా మున్సిపాలిటీ పరిధిలోని కాలనీల రహదారులు, ప్రధాన రహదారుల ఫుట్‌పాత్‌లను నిర్మించడంతో పాటు అవసరమైన చోట మొక్కలను నాటాలని నిర్ణయించారు. కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, మోడ్రన్ లైటింగ్, వాల్ పెయింటింగ్‌లను వేయించాలని తీర్మానం చేశారు. అత్యవసర కౌన్సిల్ సమావేశంలో శనివారం నిర్వహించిన అత్యవసర కౌన్సిల్ సమావేశంలో రూ.23 కోట్ల 42లక్షల నిధుల వెచ్చించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అద్భుతమైన అభివృద్ధితో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరించడమే లక్ష్యంగా నిధులను వెచ్చిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి తెలిపారు. రాబోయే మూడునెలల్లో ఎన్నికల కోడ్‌లు అమలులోకి వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలకు అవసరమైన నిధులను కేటాయించేందుకు ప్రత్యేక కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ నరసింహరాజు,కౌన్సిలర్లు అమరేందర్‌రెడ్డి, ఉషారాణి, సునీత, పత్తిప్రవీణ్,శివారెడ్డి, యాదమ్మ, నరేశ్, కో-ఆప్షన్ సభ్యులు ప్రశాంత్‌యాదవ్, టౌన్‌ప్లానింగ్ అధికారిణి పావణి, మేనేజర్ యోగేశ్‌నాయక్, ఆర్ఐ అఖిల్ పాల్గొన్నారు.

## మతాలకతీతంగా ఐక్యంగా ఉండాలి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

బండ్లగూడ, అక్టోబర్ 7 : ప్రజలందరూ మతాలకు అతీతంగా కలిసి ఉండాలని రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయంలో అన్ని మతాల వారితో కలిసి ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజేంద్రనగర్‌లో ప్రతి పండుగను అన్ని మతాల వారు కలిసి మెలిసి జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి ఘటనలకు తావు లేకుండా పండుగలు జరుపుకున్నప్పుడే ప్రశాంత వాతావరణం ఏర్పడుతుందన్నారు. ఇటీవల నిర్వహించిన వినాయక నిమజ్జనంలో అందరి సహకారంతో ప్రశాంతంగా ముగిసిందన్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ రవికుమార్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అక్కడికి విచ్చేసిన వివిధ మతాల వారిని ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ ఉపకమిషనర్ రవికుమార్, ఇన్‌స్పెక్టర్లు నాగేంద్రబాబు, పులి యాదగిరి, మధు పాల్గొన్నారు.

## విధుల్లో నిర్లక్ష్యం చేయొద్దు



పారిశుధ్య కార్మికులతో సమావేశమైన కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ,అక్టోబర్ 7: పారిశుధ్య కార్మికులు ప్రజలకు మెరుగైన సేవలందిచాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్ర పేర్కొన్నారు. శనివారం కార్పొరేషన్ పరిధిలోని పారిశుధ్య కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి వారికి తగిన సూచనలు చేశారు. కార్మికులు ప్రతి రోజు విధిగా విధులకు హాజరు కావాలన్నారు. 60 సంవత్సరాలు దాటిన వారు విశ్రాంతి తీసుకోవాలని తమ స్థానంలో కుటుంబ సభ్యులలో ఒకరిని చేర్పించాలన్నారు. విధుల్లో తప్పని సరిగా యూనిఫాంలను వాడాలన్నారు. సక్రమంగా విధులకు రాని వారిని తొలగిస్తామని హెచ్చరించారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా ఉదయం ఐదు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తప్పని సరిగా విధులు నిర్వర్తించాలన్నారు.

## బాబ్ మేళాను వినియోగించుకోవాలి

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 7 : శంషాబాద్ పట్టణంలో నిర్వహించే బాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని త్రినేత్ర ఫౌండేషన్ చైర్మన్ మడపతి పరమేశ్వరి సూచించారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి శంషాబాద్ పట్టణంలోని ఎంఎంఆర్‌గార్డెన్‌లో బాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు తెలిపారు. 50 ప్రముఖ కంపెనీల సహకారంతో త్రినేత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం ఉద్యోగమేళా ఏర్పాటు చేశామని వివరించారు. ముఖ్య అతిథిగా సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభిస్తారని వివరించారు.

## విద్యార్థులు పట్టుదలతో చదవాలి

అత్తాపూర్, అక్టోబర్ 7: విద్యార్థులు తాము అనుకున్న లక్ష్యాలను సాధించుకునేందుకు పట్టుదలతో చదువుకోవాలని తెలంగాణ రాష్ట్ర కళాశాలల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, విజ్ఞాన్ కళాశాలల వ్యవస్థాపకుడు గౌరీ సతీశ్ అన్నారు. అత్తాపూర్‌లోని విజ్ఞాన్ జూనియర్ డిగ్రీ కళాశాలలో యంగ్‌వింగ్స్ పేరుతో నూతన విద్యార్థులకు స్వాగత కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నతమైన లక్ష్యాలను పెట్టుకొని చదువుకోవాలన్నారు. వాటిని సాధించేందుకు నిరంతరం పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. తమ లక్ష్యాలు ఎంత ఉన్నతంగా ఉంటే తాము అంత ఎత్తుకు ఎదుగుతామన్నారు. కళాశాలలో చదువుకున్న విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలలో, ప్రైవేటు బహుళ స్థాయి, జాతీయ సంస్థలలో ఉద్యోగాలను సాధించడం జరిగిందన్నారు. సీనియర్ విద్యార్థులను జూనియర్ విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మానస, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సంకట హరణ ఆలయంలో అన్నదాన క్షేత్రం ప్రారంభం



అన్నదాన క్షేత్రంలో ప్రతిష్ఠించిన హనుమాన్ విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న ఫ్లోర్‌లీడర్ రామకృష్ణారెడ్డి

మణికొండ,అక్టోబర్ 7 : మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ స్వయంభు శ్రీ సంకట హరణ హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలో అన్నదాన క్షేత్రాన్ని భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేశామని మున్సిపల్ బీఆర్‌ఎస్ ఫ్లోర్‌లీడర్ రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ మల్లేశ్ తెలిపారు. హనుమాన్ దేవాలయంలో అన్నదాన క్షేత్రాన్ని స్థానికులు, పలువురు దాతల సహాయంతో ఆలయ ప్రాంగణంలో నిర్మించారు. కాగా శనివారం ఆలయ నిర్వాహకులతో కలిసి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ మల్లేశ్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో వారు ప్రత్యేక పూజలను నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాద వితరణ చేపట్టారు. దాదాపు వందేళ్ల క్రితమే స్వయంభుగా వెలసిన ఈ ఆలయానికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు దాతలు ముందుకు రావాలని ఆలయ పూజారి కస్తూరి కృష్ణస్వామి కోరారు. కొన్నాళ్లుగా ఆలయంలో స్వామివారి సేవలు చేసుకుంటున్నామని, ఇప్పటికే ఆలయ ప్రాంగణంలో నవగ్రహాల ప్రతిష్ఠ, గోసేవ, శివపార్వతుల ఆలయాన్ని ప్రతిష్ఠించామన్నారు. ఆలయాన్ని పున నిర్మించేందుకు దాతల సహాయం కోరుతున్నామని తెలిపారు. ఆలయ భూముల పరిరక్షణ కోసం హైందవులంతా కలిసి కట్టుగా ముందుకు రావాలని కృష్ణస్వామి విజ్ఞప్తి చేశారు. శనివారం జరిగిన అన్నదాన కార్యక్రమంలో సుమారు వెయ్యిమంది వరకు భక్తులు హాజరై ప్రసాదాన్ని స్వీకరించడం విశేషం.

## క్రీడలు మానసికోల్లాసానికి దోహదం




బండ్లగూడ శారదాధామంలో ఆంధ్రప్రదేశ్,తెలంగాణ,కర్ణాటక రాష్ట్ర శిశుమందిర బాల బాలికల వ్యక్తిగత క్రీడా పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ పోటీలను పారిశ్రామిక వేత్త అనిల్‌కుమార్ విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిశుమందిరాలు విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యతను ఇవ్వడం అభినందనీయమన్నారు. శరీరక దృఢ త్వం కోసం మానసిక వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడుతాయన్నారు.ఈ కార్యక్రమంలో విద్యాభారతి దక్షిణ మధ్య కేత్ర కార్యదర్శి లక్ష్మణ్‌రావు, విద్యాపీఠం తెలంగాణ సంఘటన కార్యదర్శి శ్రీనివాస రావు, భాస్కర్, సింహాద్రి, సూర్యనారాయణ సుధా చల్లా తదితరులు పాల్గొన్నారు. -బండ్లగూడ,అక్టోబర్ 7

## పరిసరాల శుభ్రత పాటించాలి



ఫ్లాగ్ రన్ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డా.జి.చంద్రమోహన్‌రెడ్డి

మణికొండ, అక్టోబర్ 7 : పరిసరాల పరిశుభ్రతపై ప్రతి పౌరుడు బాధ్యతతో మెలగాలని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాల (ఎంజీఐటీ) ప్రిన్సిపాల్ డా.జి.చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఎంజీఐటీ కళాశాలలో శనివారం పెప్సికో ఫ్లాగ్ రన్ కార్యక్రమాన్ని ద సోషల్ ల్యాబ్ వారి సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లాగ్ రన్ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంజీఐటీ కళాశాల నుంచి గండిపేట చౌరస్తా వరకు సుమారు 600 మంది వలంటీర్లు, ఉద్యోగులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రోడ్ల పక్కన ఉన్న చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత యొక్క ప్రాముఖ్యతను పలువురు ప్రతినిధులు హాజరై వివరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా చుక్కపల్లి సురేశ్, ది సోషల్ ల్యాబ్ నిర్వాహకులు సందీప్ అరోరా, కాశీ విశ్వనాథన్, ఎన్ఎస్ఎస్ అధికారి డా.జి.బాల్‌రెడ్డి, వలంటీర్లు రామకృష్ణ, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ చీరలు పంపిణీ

బండ్లగూడ,అక్టోబర్ 7: రాజేంద్రనగర్‌లో బతుకమ్మ చీరల పంపిణీ కొనసాగుతున్నట్లు డీపీవో రాధారాణి తెలిపారు. శనివారం ఆమె రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బతుకమ్మ చీరల పంపిణీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పలువురి చీరలను పంపిణీ చేశారు. ప్రజలందరూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు 15వేలు పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు.



బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న డీపీవో రాధారాణి